అంతా స్మార్ట్ మయం..



- వైర్‌లెస్ హెడ్‌సెట్లపై యువత ఆసక్తి
- అభిరుచులకు అనుగుణంగా తీసుకొస్తున్న కంపెనీలు



కాలక్రమేనా సాంకేతిక రంగంలో మార్పులు వస్తున్న నేపధ్యాన యువత దానికి అనుగుణంగా తమ శైలిని మార్చుకుంటున్నారు.

ప్రస్తుత కాలంలో స్మార్ట్ ఫోన్ వినియోగం అధికమవ్వడంతో ఫోన్లకు అనుగుణంగా ఉండే హెడ్‌సెట్లు మార్కెట్లలో ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిస్తున్నాయి.

దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వైర్‌లెస్ బ్లూటూత్ హెడ్‌సెట్స్

వైరారూరల్: వ్యాపారవేత్తలు, విశ్లేషకులు, యువతతో పాటు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు నిత్యం గంటల తరబడి ఫోన్‌కాల్స్ మాట్లాడడం అనవాయితీగా మారిన క్రమంలో వారి సౌకర్యార్థం మార్కెట్‌లో విభిన్న డిజైన్లు కలిగిన హెడ్‌సెట్లు లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం వైర్ లెస్ హెడ్‌సెట్లు అధికమైన నేపధ్యాన ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, విద్యార్థులు వీటిని కొనుగోలు చేసుకొని తమ ఫోన్ కాల్స్‌ను సౌకర్యవంతంగా మాట్లాడుతున్నారు. కొంత మంది అయితే స్టైల్ కోసం వైర్‌లెస్ హెడ్‌సెట్లను మెడలో వేసుకొని చక్కర్లు కొడుతూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు.

సరి కొత్తగా అందుబాటులోకి..

ఒకప్పుడు అతి తక్కువ ధరలో వైరు కలిగిన హెడ్‌సెట్లు అందుబాటులో ఉండేవి. కాలక్రమేనా కొత్త వర్షన్ కలిగిన వైర్ లైస్ డివైస్‌లు మార్కెట్లోకి వచ్చాయి. ఈ హెడ్‌సెట్లకు బ్లూటూత్ అవకాశం ఉండడంతో మన ఫోన్‌లోని బ్లూటూత్ సాయంతో ఈ వైర్‌లెస్ హెడ్‌సెట్లను కనెక్ట్ చేసుకొనే సదుపాయం ఉంది. వీటికి కొన్ని గంటల చార్జింగ్ పెడితే సుమారు రెండ్రోజుల పాటు వినియోగించుకునే అవకాశం ఉంది. దాంతో యువత ఈ బ్లూటూత్ హెడ్‌సెట్లను తమ ఫోన్లతో పాటుగా ట్యాబ్‌లు, కంప్యూటర్లకు సైతం కనెక్ట్ చేసుకోని ఆనందిస్తున్నారు. అంతేకాకుండా ఇంకో సరికొత్త వర్షన్‌లో బర్డ్స్ పేరుతో వైర్లు లేని హెడ్‌సెట్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇవి ఒక దానికి ఒకటి కలిసిపోకుండా ఒక చిన్నపాటి బాక్సు వంటి దానిలో అనుసంధానించే హెడ్‌సెట్స్ ఆన్‌లైన్ మార్కెట్‌తో పాటు పట్టణాల్లోని ప్రముఖ దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి.

ధరను లెక్క చేయకుండా..

యువత అభిరుచులకు అనుగుణంగా వివిధ కంపెనీలు మార్కెట్‌లోకి విభిన్న డిజైన్లు కలిగిన బ్లూటూత్ హెడ్‌సెట్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. ప్రస్తుతం అధిక సంఖ్యలో ఓన్‌ప్లస్, రియల్‌మీ, రెడ్‌మీ, ఎయిర్ పార్ట్స్, ప్రోటన్, నాయిస్, బోట్, జేబీఎల్, మార్చంట్, జీబ్రానింగ్, మార్షెల్ వంటి కంపెనీలు, వైరు కలిగిన బ్లూటూత్ హెచ్‌సెట్లు, వైర్ లైస్‌తో కూడిన బర్డ్స్‌ను అందుబాటులోకి తెచ్చాయి. వీటి ధర సుమారు రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఉన్నాయి.

ఆసక్తి కనబరుస్తున్న యువత..

ఈ బ్లూటూత్ హెడ్‌సెట్స్, బర్డ్స్‌లలో ఉండే హైక్వాలిటీ, సీరియో సౌండ్స్‌లను అలవాటు పడి యువత ఆసక్తి కనబరచడంతో మార్కెట్లో వీటికి బాగా డిమాండ్ పెరిగింది. కళాశాలలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు బస్సులలో కాలక్షేపం, ఇతరత్రా అవసరాలకు వీటిపై మక్కువ చూపుతున్నారు. దీంతో పలు కంపెనీలు వీటిని తయారుచేసి మార్కెట్లో విడుదల చేస్తున్నారు.

డిమాండ్ పెరిగింది..



వైర్‌లెస్ బ్లూటూత్ హెడ్‌సెట్లకు డిమాండ్ పెరిగింది. అధిక శాతం మంది కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా హైక్వాలిటీ స్టీరియో సౌండ్ సిస్టమ్‌తో ఫోన్లు మాట్లాడుకునే అవకాశం ఉండడంతో డ్రైవింగ్ చేసే వాహనదారులు వీటి కొనుగోలుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

– దారా చంద్రకాంత్, సెల్ షాపు యజమాని

సౌకర్యవంతంగా ఉంది..



వైర్ లెస్, బ్లూటూత్ హెడ్‌సెట్ల వినియోగం సౌకర్యవంతంగా ఉంది. ఆన్‌లైన్ తరగతులకు ఈ హెడ్‌సెట్లు ఎంతో గానూ ఉపయోగపడుతున్నాయి. అంతే కాకుండా కళాశాలలకు బైక్‌ల మీద వెళ్లేటప్పుడు ఫోన్లు మాట్లాడుకునేందుకు ఇబ్బంది లేకుండా ఈ హెడ్ సెట్లు సహకరిస్తున్నాయి.

– మునగంటి సాయికుమార్, డిగ్రీ విద్యార్థి

కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



కల్లూరురూరల్: కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు చీరను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

కల్లూరురూరల్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం కల్లూరులో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 67 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లూరు మండలంలో అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. అమలు చేయలేని వాగ్దానాలు చేసి ప్రజలను మోసగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని, జనాలను రెచ్చగొట్టి సంక్షేమ పథకాలను విచ్చిన్నం చేయడానికి కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, తహసీల్దార్ బాబ్జిప్రసాద్, ఎంపీడీఓ రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రసాద్, కమ్మి తదితరులు పాల్గొన్నారు.

గౌరైలు పంపిణీ చేయాలి..

కల్లూరు: రెండో విడత గొర్రెలను త్వరగా పంపిణీ చేయాలని గొర్రెల సహకార సంఘం సభ్యులు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను శనివారం కలిశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యను జేడీ దృష్టికి తీసుకెళ్లి మూడురోజుల్లోగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని మంగాపురం గ్రామంలో శనివారం పలు కుటుంబాలను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. మంగాపురం ఉప సర్పంచ్ దుగ్గిదేవర నరసింహారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎమ్మెల్యే పరామర్శించి ప్రమాదం సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. పరుచూరి బసవయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరమోహన్‌రెడ్డి, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భద్రరాజు, రైతు బంధు మండల అధ్యక్షుడు వెంకటలాల్, జోన్ చైర్మన్ దాసురావు, జీవీఆర్, పత్తిగడప పెద్ద రామకృష్ణంరాజు, ఉదయ్ పాల్గొన్నారు.

మంగాపురం–నారాయణపురం రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే..

తల్లాడ: మండలంలోని మంగాపురం–నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్డు పనులను సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి..

సత్తుపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్టీస్పెషాలిటీ డెంటల్‌కేర్ ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ దేవరపల్లి ప్రవీణ్, డాక్టర్ కంచర్ల శివసంయుక్త, తుమ్మల చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, మధు, అనీల్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోండి



వైరారూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ ధనమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది

సత్తుపల్లిటౌన్/వైరారూరల్: పోషకాహారం తీసుకోవటంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ ధనమ్మ తెలిపారు. పోషణమాసం సందర్భంగా శనివారం సత్తుపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో, వైరారూరల్ మండలంలోని రెబ్బవరం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలల నిండిన చిన్నారులకు బాలమృతం ఇవ్వాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై పలు సూచనలు చేశారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్. బీజాన్బీ, సర్పంచ్ రామారావు, అంగన్‌వాడీ టీచర్లు అవ్వమ్మ, అరుణ, రాధా, రహ్మతున్నీసా, మంగతాయారు, సర్వేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

కొణిజర్ల: విద్యార్థులు తమ జీవితంలో ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని శ్రీ కవిత విద్యా సంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్లినికల్ సైకాలజిస్టు డాక్టర్ గోగి శ్రీకాంత్ ఆచార్య అన్నారు. శనివారం కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.జాన్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తరుణమ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఫరీద్ బాబా, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సత్కారం

వైరా: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ఎస్.సత్యలీనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో శనివారం వైరా వాణీ వివేకానంద విద్యాలయం యాజమాన్యంతో పాటుగా వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్, హరినాద్, ప్రముఖ పాత్రికేయుడు కృష్ణారావులు సత్యలీనాను సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు.

తక్కువ ధరకు అందించాలి

తల్లాడ: రేషన్ షాపుల్లో తక్కువ ధరకు నిత్యావసరాలు అందించాలని మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కుర్నవల్లి గ్రామంలో నిత్యావసర సరుకులపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా తల్లాడ మండల అధ్యక్షురాలు పకీరమ్మ, కృష్ణమ్మ పాల్గొన్నారు.

కాళోజీ జయంతి వేడుకలు



సత్తుపల్లిరూరల్: కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కమాండెంట్ పి.వెంకటరాములు

మధిర/వైరా/సత్తుపల్లిరూరల్: ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడు, కవి కాళోజీ నారాయణరావు అని బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, వైరా ఠాగూర్ చైర్మన్ సంక్రాంతి సునీత, కరస్పాండెంట్ రవికుమార్‌లు తెలిపారు. శనివారం సత్తుపల్లిలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో, మధిరలోని భరత్ విద్యా సంస్థల్లో, వైరాలోని ఠాగూర్ విద్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు భాషాఅభివృద్ధికి కాళోజీ నారాయణరావు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ప్రజలను తన కవిత్వం, రచనల ద్వారా చైతన్యవంతం చేశారని వివరించారు. భారత ప్రభుత్వం పద్మవిభూషన్ పురస్కారంతో కాళోజీని సత్కరించిందని, అటువంటి ఆయన ఆశయ సాధనకై మనమందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, డీన్ రవీందర్ రెడ్డి, ఉమ, స్రవంతి, నాగరాజు, అజీమ్ పాషా, గణేష్, త్రివేణి, శశికళ, పద్మ, సహాయ దళాధిపతి ఎం.ఉదయ్‌భాస్కర్‌రావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అండగా ఉంటుంది..



ఎర్రుపాలెం: పంపిణీ చేసిన కరపత్రాలతో సీపీఎం నాయకులు, గ్రామస్తులు

ఎర్రుపాలెం/ముదిగొండ/వైరారూరల్: దోపిడి ఉన్నంత కాలం పేదల పక్షాన ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఎం మండల కార్యదర్శులు దివ్వెల వీరయ్య, బట్టు పురుషోత్తంలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో ఎర్రుపలెంలోని మండలంలోని రేమిడిచర్లలో, ముదిగొండలోని ప్రధాన సెంటర్‌లో, వైరారూరల్ మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో శనివారం నిరసనలు తెలిపారు. అనంతరం గ్రామాల్లో కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్‌కార్డులు, గృహలక్ష్మి, దళితబంధు, బీసీ, మైనార్టీ రుణాల లబ్ధి కలిగేలా పథకాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందేవరకు సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, నాగులవంచ వెంకట్రామయ్య, మాదాల వెంకటనర్సయ్య, నాగులవంచ లగడపాటి అప్పారావు, సగ్గుర్తి సంజీవరావు, మారాబత్తుల స్వామి, రావిరాల మోక్షానందం, కొండెపాటి గురవయ్య, కృష్ణ, వరప్రసాద్, వెంకన్న, కల్యాణ్, భద్రయ్య, హనుమంతరావు, నాగరాజు, ఉపేందర్, కిలారు శ్రీనివాసరావు, సాంబశివరావు, శ్రీనివాసరావు, లక్ష్మీబాబు తదితరులు ఉన్నారు.

రాజీ మార్గమే.. రాజ మార్గం



సత్తుపల్లిటౌన్: రాజీపడిన దంపతులకు మొక్క అందజేస్తున్న అదనపు జిల్లా జడ్జి వెంపటి అపర్ణ



మధిర: మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి

మధిర/సత్తుపల్లిటౌన్: రాజీ మార్గమే.. రాజ మార్గమని న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డి, 6వ అదనపు జిల్లా జడ్జి వెంపటి అపర్ణలు తెలిపారు. జాతీయ మెగా లోకదాలత్‌లో భాగంగా శనివారం మధిర కోర్టు పరిధిలో మొత్తం 2636 కేసులు పరిష్కారమై రికార్డు నమోదయింది. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 1031 కేసులు పరిష్కారం కాగా రూ.1,73,200 జరిమానా విధించారు. అదే విధంగా 1223 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా రూ.2,52,225 జరిమానా విధించారు. 6 సివిల్ కేసులు పరిష్కారం అయ్యాయి. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 376 కేసులు పరిష్కారం అయ్యాయి. అదే విధంగా సత్తుపల్లి లోక్ అదాలత్‌లో 660 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని.. తిరిగి అపీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. కక్షిదారులకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవటం శుభపరిణామమన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులకు డబ్బు, సమయం ఆదావుతుందన్నారు. రాజీ మార్గమే కేసులకు రాజమార్గమన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంక్ రుణాల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అనంతరం రాజీపడిన దంపతులకు మొక్కలను అందచేసి అభినందనలు తెలిపారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ఎవరూ కూడా హింసను ప్రేరేపించవద్దని సూచించారు. కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయవాదులు, పోలీసులు, ప్రాసిక్యూషన్ విభాగం, కోర్టు సిబ్బందిని న్యాయమూర్తి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, సంబూరు జనార్దన్ రావు, కట్టా పూర్ణచంద్రరావు, చావలి రామరాజు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, కావూరి రమేష్, పల్లపోతుల కృష్ణారావు, సతీష్, గంధం శ్రీనివాసరావు, కాకాని విజయ్ కుమార్, వెంకట్రావు సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషాశరీన్, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో నిరసనలు

సాక్షి నెట్‌వర్క్ : మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై ఆ పార్టీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. మధిర, ఎర్రుపాలెంలో జరిగిన నిరసనలో నాయకులు దోమందుల సామేలు తదితరులు పాల్గొన్నారు. అలాగే, చంద్రబాబును అరెస్ట్‌ను బోనకల్ మండల టీడీపీ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ ఖండించారు. ఇక చింతకానిలోని టీడీపీ కార్యాలయం చేపట్టిన ఆందోళనలో నాయకులు తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కారేపల్లిలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మండెపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా.. రావిచెట్టు బజార్, వాయుపుత్రా వెంచర్, శివసాయినగర్, మసీద్‌రోడ్, గ్యాస్ గోడౌన్, కాకర్లపల్లిరోడ్డులలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

మధిర: మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్ కల్యాణ మండపంలో శనివారం శ్రీనిధి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల గౌరవ చైర్మన్ అనీల్ కుమార్ నెప్రూూ, గౌరవ అధ్యక్షుడు దండెం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ యాదమ్మ రాజు టీం విద్యార్థులను అలరించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనిధి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కారేపల్లి: మండలంలోని సీతారాంపురం గ్రామంలో దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉమాశంకర్, శ్రీకోటమైసమ్మతల్లి దేవాలయం ధర్మకర్త పట్టాభిరామారావులు పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.4016లకు పెంచి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకుడు కొండమీద నాగేశ్వరరావు, నాయకులు బిక్షమయ్య, రామచంద్రయ్య, సర్పంచ్ కుమార్, సొసైటీ డైరెక్టర్ రోశయ్య, రాంకిషోర్, కోటి, హరు, వికలాంగులు, స్థానిక వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

వృద్ధులకు పండ్లు పంపిణీ

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం దొడ్డా సుధాకర్ సహకారంతో వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల సౌకర్యార్థం బకెట్లు, డోర్ మాట్స్, గ్లాసులను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు వెంకటేశ్వరరావు, సురేష్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కారేపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కారేపల్లి: మండలంలోని గాంధీ నగర్ గ్రామానికి చెందిన ఎజ్జు రవి, సునీత దంపతులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీతకు రెండు కాళ్లకు తీవ్రగాయాలు కాగా.. ఒక కాలును తొలగించారు. రవికి సైతం ఒక కాలుకు తీవ్ర గాయమైంది. వీరి శస్త్ర చికిత్సకు రూ.8లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో కారేపల్లి హైస్కూల్ 1992–93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆస్పత్రిలో ఆ కుటుంబాన్ని పరామర్శించి, రూ.13వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసాద్, జానకి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.10 వేలు..

కల్లూరు: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు సాధించిన కల్లూరు మండలంలోని కప్పలబంధం గ్రామానికి చెందిన మేరుగు ఉమామహేశ్వరిని శనివారం కల్లూరులో ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ ఆనంద్ మిత్ర బృందం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా పాఠశాలలో చెల్లించే ఇన్సూరెన్స్ రూ.5 వేలు పూర్వ విద్యార్థులు చెల్లించే విధంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, కప్పలబంధం సర్పంచ్ ప్రసాద్, విద్యార్థిని తల్లిదండ్రులు అంజయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.40 వేలు..



నగదు అందజేస్తున్న గ్రామస్తులు

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురంలో పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్న పగిడి వెంకటేశ్వర్లు గత కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. శనివారం పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి గ్రామ పెద్దలు రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యప్రసన్నాంభ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కనకరత్నం, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ..

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఎన్నార్టై ఫౌండేషన్ సహకారంతో శనివారం రూ.20 వేలు విలువ చేసే టీవీని తన్నీరు విశ్వనాథం జ్ఞాపకార్థ తన్నీరు కోటేశ్వరరావు, మాదవి దంపతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు డిజిటల్ క్లాస్‌ల ద్వారా విద్యాబోధన చేయడానికి టీవి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారావు, ఏసీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

సత్తుపల్లి: ప్రస్తుత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ అన్నారు. సత్తుపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహారదీక్షల శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాన రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. వర్గీకరణ ద్వారానే మాదిగ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.ఈదయ్య, జె.వెంకటేశ్వర్లు, జి.ముత్తారావు, ఏసు, రవి, ప్రసాద్, శ్రీను, అర్జున్‌రావు, లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ముదిగొండ: ముదిగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిణి అరుణాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న మంగళవారం నుంచి ప్రత్యేకంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ వ్యాధులు, నోటి కేన్సర్, మూత్రకోశ వ్యాధులు, సుఖవ్యాధులు, మోనోపాస్, నెలసరి సమస్యలు, సంతానలేమి, అధిక బరువు, తదితర సమస్యలకు స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆమె సూచించారు. ముదిగొండ మండలంలోని మహిళలు తమ వెంట ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్‌తో ఆస్పత్రికి రావాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉచిత వైద్య శిబిరం

మధిర: మడుపల్లిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి తగిన మందులను ఉచితంగా అందించారు. పరిసరాల పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు సుబ్బలక్ష్మి, సిబ్బంది గోవింద్, కౌసల్య, లీల పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

బోనకల్: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని రజక సేవా సమితి కోకన్వీనర్ తమ్మారపు బ్రహ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమికోసం భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ముందు నిలబడి పోరాడిన చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా జరుపుకోవాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో రజకసంఘం నాయకులు కొండా శ్రీనివాసరావు, తమ్మారపు వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, రేగళ్ళ శ్రీకాంత్, కృష్ణ, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో శనివారం శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఎన్ఆర్ఐ దినేష్ రెడ్డి, నాగజ్యోతి దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్ పర్సన్ గుర్రం ప్రమీల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వజ్రాల మాధవరెడ్డి, మాధురి, కటకం నరసింహారావు, ఆవుల శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, కృష్ణమూర్తి, అంజని, తాళ్లూరి కృష్ణసూరి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

చింతకాని: మండల కేంద్రంలో శనివారం బీజేపీ నూతన కార్యాలయాన్ని మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ జిల్లాలో సత్తాచాటుతుందన్నారు. విజయరాజు, కృష్ణారావు, స్వర్ణకర్, వెంకటేశ్వర్లు, వీరప్రసాద్, రామారావు, గోపి, కృష్ణయ్య పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్

ఏన్కూరు: రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ బాలాజి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పొలాల్లోకి వెళ్లి రైతుల సాగు వివరాలు, తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నర్సింహారావు పాల్గొన్నారు.

దాతలు సహకరించండి

కారేపల్లి: అసంపూర్తిగా నిలిచిపోయిన కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మరుగుదొడ్లకు దాతలు విరాళాలు అందించి సహకరించాలని సింగరేణి సర్పంచ్ ఆదెర్ల స్రవంతి అన్నారు. శనివారం మండలంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి మాధారం డోలమైట్ యాజమాన్యం మంజూరు చేసిన రూ.6 లక్షలతో సగం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులకు దాతలు సహకరించాలని కోరారు.